# ★ గు ణ పా ఠం ★

రచన : దేవగుప్తాపు సావిత్రి.

— ౦ .—

ఆనంద్, నిర్మల్, ముకుంద్ ప్రాణస్నేహితులు. ఆఫీసు టైములోతప్ప, మిగతా ఎపుడూ కట్టకట్టుకొని ఒకచోటే యుంటారు. మూడొంతులు ఆనంద్ ఇంట్లోనే కాలం వెళ్ళబుచ్చుతారు. ముగ్గురికి పెళ్ళిళ్లు అయ్యాయి-ముగ్గురు 1950 సంవత్సరపు పిల్లలే అయితే ఆనంద్ భార్య శాంత నిజముగా శాంతయే. మనుష్యులను యిట్టే ఆకర్షిస్తుంది. అట్టే మాటాడదు. మాట్లాడితే ముద్దుగా వినాలనిపిస్తుంది మంచి తెలివైనది- తన నాగరికత అంతా భర్త భావాలతో కలిసి వినియోగించుకొంటుంది.

అందుచే చాలామంది ఏమాత్రం టైమున్నా వీళ్ళ యింటికి సాయంత్రంచేరి సరదాగా కాలం తోస్తారు ఆనంద్ ఆనందమే ఎప్పుడూ సరదాగా యుంటాడు. పది మందిని చేరదీస్తాడు వాళ్ళకు శాంతచే కాఫీలు, టీలు ఇప్పించడం, ప్రపంచసంగతులన్నీ శాంతను కూడా కూర్చోపెట్టుకొని డిస్కస్ చేయడం ఏమాత్రం అవకాశంయున్నా బాగావినియోగించుకొని ఆనందించడం, అతనికి బాగా తెలుసు కష్టమొస్తే ప్రతీవానికీ సాయపడతాడు, కల్మషంలేదు. అందరూ తనలాంటివాళ్ళే అనుకొని చాలాబాగా చూస్తాడు ఇతని ట్రైనింగ్ వల్లనే శాంత అట్టే చదువు లేకపోయినా చాలా ప్రపంచజ్ఞానము కలదైనది ఆమెకు తెలియని విషయంలేదు. భర్త పదిమందిలో తిరుగుట ఉండుట అలవాటు చేయుటచే అతని లేని వేళలందుకూడా అతని స్నేహితులు వస్తే బాగాచూసి అతని మర్యాద నిలబెట్టుతుంది.

ఇంక నిర్మల్ జీవితము నిర్మలముగా వున్న దానిలోనే ఒడి దుడుకులు లేకుండా నడుపుతాడు. ఆశలేని ఆస్తిలేని మనిషి లెక్కలే ఆధారం. ఇన్స్యూరెన్స్ కంపెనీ మేనేజరు చేతికిండా గడిస్తాడు ఖర్చుపెడ్తాడు ఆనంద్‌ని గురువుగ చూచుకుంటాడు

మరి ముకుందుని స్టడీచేయడం కష్టం మనిషి జలసా పురుషుడు మధ్య మధ్య పప్పులో అడుగు వేస్తాడు, పైకి దబాయించి తిరుగుతాడు ఆనంద్ దగ్గర మాత్రము చాలా వినయముగ అతను చెప్పినవాటిల్లో నాలుగోవంతైనా ఆచరణలో పెడ్తాడు అప్పువేసైనాసరే ముచ్చట్లు తీర్చుకుంటాడు జీవనానికి లోపంలేని ఆస్తి తరుచు వ్యాపారములో తలదూరుస్తూ, మిలగటోయి తెలివితేటల వల్ల లక్ష్మీ కటాక్షముచేతనూ తేల్తూ ఉంటాడు శాంతకు మాత్రము ఇతనంటే మంచి అభిప్రాయములేదు అలా అని అగౌరవ పరచదు, భర్త స్నేహితునికి ఇవ్వవలసిన గౌరవం ఇస్తుంది నిర్మలతో కొంచెము చనువుగా మంచి చెడ్డలు మాట్లాడుతూ వుంటుంది.

ఆరోజుకూడా అంతా ఆనంద్ ఇంట్లో చేరారు. రెండు మూడుగంటలు బాతాకాని అయ్యాక లేచారు, ఇంతలో ఆనంద్ "ఏమర్రోయి రేపునేను క్యాంపుపోతాను. కొంచము మీ 'సిస్'ని చూడండీ బహుశా ఒకవారం ట్టే అనుకొంటాను" అన్నాడు శాంతను ఆతనలాగ ఎప్పుడూ అప్పచెప్పలేదు ఇప్పుడలా అంటాడనుకోలేదు. అందులో ముకుంద్ వుండగ అనడం ఇష్టంలేకపో

యింది "ఏం నన్నుఎవరేనా ఎత్తుకుపోతారాఅవ్వ తాతఉన్నారు లెండీ? క్యాంపులు కొత్తా మనకు అన్నది. "అదికాదోయ్! ఎత్తుకుపోయినా సీతాదేవిలా రోజులు లెక్కపెట్టక వాణ్ణి బుట్టలో పెట్టి తిరిగివస్తావు" అన్నాడు. అంతా నవ్వుకున్నారు రాత్రి సామాను సర్దుతూ "ఏమిటండీ? మీరుకూడా అలా అన్నారు, మీరు సిమ్లావెళ్లితే నేనొక్కర్తిని లేనూ" అంది,

పొద్దునే ఆనంద్ కారు తీసేటప్పటికి స్నేహితులు తయారయ్యారు, వెళ్లుతూ "శాంతా! నిర్మల్ కారుతెచ్చి పెడ్డులో పడవేస్తాడు డ్రైవరుకు చెప్పనక్కరలేదు" అంటూ వెళ్లిపోయాడు. మూడోరోజున నిర్మల్ సంచితో కూరలు తెచ్చి పడేశాడు "క్షేమమా! చెల్లీ! ఆఫీసులో పనెక్కువగుటచే రాలేకపోయాను. మీఒదిన్నె వెళ్ళమంటే సింగారించి బయలుదేరేసరికి మామేనత్త కొడుకు వచ్చాడు. దాంతో రథం వెనక్కు తిరిగింది" అన్నాడు. "దానికేం! అన్నయ్యా! సహధర్మచారిణిలా రేడియో వుంది. పిల్లలబదులు పుస్తకాలున్నయ్; అంది అత్త, అవ్వ, టామీని పలకరించి వెళ్ళిపోయాడు.

సాయంత్రం 5 గంటలకు సోఫాలో కూర్చొని పుస్తకాలు తిరగేస్తోంది సైకిలుబెల్లు చప్పుడైంది ముందు గుప్పుమని సెంటువాసన వచ్చింది, తరువాత బూట్సుచప్పుడు, యీలతో ముకుందు వచ్చాడు; అతని స్టయిల్ అది అయితే ఈరోజు చాలా ఉషారుగా యున్నాడు చేతిలో ఏదో చిన్న పొట్లాంవుంది వచ్చీ రావడంతోనే శాంత దగ్గరకువచ్చి, "ఇవిగో పువ్వులు. అలావస్తోంటే కొనమని కుర్రాడు అడ్డుపడ్డాడు. వికసించిన పువ్వులంటే నాకుసరదా" అంటూ శాంత బల్లమీద పెట్టమంటున్నా విననట్టు చేతికి అందించాడు— శాంతకు ఇష్టము లేకపోయింది. తొందరపాటు మనిషి అనుకొంటూ "నేను ఇపుడు ఎక్కడకూ వెళ్ళను. నాకు పువ్వులెందుకు వదినగారికి ఇవ్వండీ" అంది

"ఓహో! ఆనంద్ లేడని పువ్వులు పెట్టరా లోపల మీకింకా పాతభావాలు పోలేదే" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

"ఆయనకు ఒకటి. రెండు పెట్టుకుంటే ఇష్టం దేనికైనా మితివుండాలి ఇపుడు సినిమాల్లోనూ, స్త్రీల తలల్లోనూ, పూలతోటలే లేస్తున్నాయి" అంది ఏదోటి మాట్లాడాలికదా అని,

"దానికేంగాని ఇవాళ మంచి ఇంగ్లీషుపిక్చరు సుబ్బులు వస్తోంది. నువ్వొస్తావని సీట్లు బుక్ చేసి వచ్చాను? రెడీకా" అన్నాడు.

"ఆయన లేకుండా నేనెక్కడకు వెళ్లట నాకలవాటులేదు క్షమించండి" అంది. శాంతమాట వినగానే ఉసూరుమన్నట్లుగా చతికిలబడి "అదేనేను ఎపుడు అనుకుంటున్నాను. ఆనంద్ ఎంతఅదృష్టవంతుడా నీలాటివైఫ్ దొరకడానికి అని, ఒకదాంట్లోనా అంటే కాదే. అన్నిటల్లోనూ, చెప్పమంటారా, గుణం చదువు తెలివితేటలు అన్నిటికన్న రూపం, చక్కదనం ఎవరికున్నాయి. మీరంటే నాకు అపరిమితమైన ప్రేమ, మిమ్మల్ని దేవతలాగ మనస్సులో ఆరాధించుకొంటున్నాను చాలా రోజులనుంచి మీకొకవిషయం చెప్పాలని నాకోరిక- ఈనాడు వీలైంది. చెప్పమంటారా?" అని శాంతకేసి ఆశగా చూశాడు. శాంతకు ఏమి చెప్పడానికి తోచలేదు. ఏమి అడుగుతాడో కూడా తట్టలేదు? ఆ వాగ్ధోరణిచూస్తే తనవెకిలి చేష్టలు ఇక్కడ విప్పుతాడేమో ఈ వాగుడు మనిషిని ఎలా తప్పించుకోవడమా అనుకుంటూ పువ్వులు కట్టు విప్పి పువ్వులు పరీక్షచేస్తూ కూర్చుంది ఇంతలో స్టోరుకువెళ్లిన అవ్వ అమ్మాఅంటూ డబ్బు, బిల్లు కాగితం పట్టుకొనివచ్చి బల్లమీద పెట్టి పక్కన చతికిలబడింది. శాంతకు ప్రాణం లేచొచ్చింది. అతనుమాత్రం దాన్ని కొరకొరచూచి, మిమ్మల్ని ఒకనిముషమైన కూర్చోనివ్వదేమిటి ఈఅవ్వ" అన్నాడు,

"లేదు బాబూ నాకు దబ్బంటే భయము. అమ్మగోరు నోట్లు ఇస్తారు'' అంది వెట్టిబాగులది.

"ఇవాళ బాడ్‌డే! రేపు ప్రొద్దుట వస్తాను నా కోసము పదినిముషములు వీలుచేసుకోండి అంటూ వెళ్ళిపోయాడు.

అలా ఎంతసేపు కూర్చొని ఆలోచించింది.

అవాకు్కలు. చెవాకు్కలు, ప్రేలితే ఎలాబుద్ధి చెప్పడమా అని, మళ్లీ పాపం, అనవసరంగా అనుమాన పడుచున్నానేమో అనుకొంది, వీధి గుమ్మంలో టాక్సీఆగిన చప్పుడైంది. తలెత్తి చూసింది. ఆనంద్ గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు దేశయాత్రలకు చెప్పకుండా వెళ్ళిపోయిన భర్త తిరిగి వచ్చినంత సంతోషంకలిగింది శాంతకు. తాత, అవ్వ, సామానులు లోపలపెట్టుచున్నారు. వాళ్ల టామీ తోకఆడిపించుకొంటూవచ్చి ఆనంద్ కాళ్లు నాకడం మొదలుపెట్టింది.

"ఇపుడు వస్తా ననుకోలేదుకదూ" అంటూ పువ్వులు వాసనచూస్తూ "పువ్వులు కొన్నావా?" అని అడిగాడు- శాంతకు ఏమి చెప్పటకు తోచ లేదు. జరిగినదంతా చెప్పేదామనుకొంది- తొందర పడకూడ దనుకొని నవ్వుతూ, మీ స్నేహితులకు అప్పచెప్పారు కదా సప్లయిచేసారు'' అంది-

"అన్నీ ఇంకా మర్చిపోలేదా" అంటూ వీపు తట్టాడు- భోజనందగ్గర నోటివరకువచ్చి సమాళించుకొని ఊరకున్నది- ప్రొద్దుటే కాలకృత్యాలు తీర్చుకొని అన్నీ త్వరగా ముగించివేసింది-

"ఏయ్, మెయిల్ లాగ తిరుగుతున్నావు- విశేష మేమిటి" అన్నాడు-

''శేషం ఉందిలెండి' తెలుస్తుంది'' అంది అంటూఉండగానే సైకిలు చప్పుడైంది- ముకుంద్ వచ్చాడు రెడీ మాస్టర్ అన్నాడు. శాంత గబగబా ఆనంద్ జోళ్లు లోపలపెట్టి, అతన్ని పట్టుకు లోపల గదిలోకి తీసుకెళ్లి "ఇదుగో చూడరూ మీరు చాలా మంచివారు, ముకుంద్ వచ్చాడు, తమాషా చేస్తాను, మాట్లాడకండేం. మీరు వచ్చి నట్లు తెలియనివ్వకండి.

మంచివారు కదా. మధ్యలో మాట్లాడితే ఒట్టే అంటూ అతని గడ్డంపట్టుకొని బ్రతిమాలి తలుపు దగ్గరకేసి సోఫాలో కూర్చుంది, పేపరు పట్టుకొని. ఆతనికి యీగొడవ అర్థంకాక తమాషా చూద్దామనిపించింది, ముకుందు వస్తూనే "రెడీగా యున్నారే. అయితే యిద్దరిభావాలు ఒకటే అన్న మాట" అంటూ జేబు తడుముకొని సిగరెట్టు మర్చిపోయాను. అవ్వ ఏది అన్నాడు "అవ్వ బజారుకెళ్లింది" అంది, "అది నోట్లో ఉంచేనే కాని, మనకిపని. మాట తోచదు సరేకాని చూడు శాంతా" అంటూ ప్రక్కన కూర్చున్నాడు శాంత ఏం అన్నట్టు చూసింది.

"ఇంక రహస్యము ఎందుకు, నిన్ను చూచి నప్పటినుంచీ పిచ్చి యెత్తినట్టుంది. ఇన్నిరోజులు దాచానంటే ఆనంద్ మీదవున్న గౌరవమే కారణం- ఆనంద్ వట్టి వెర్రివాడు- నిన్ను సుఖపెట్టడం తెలియదు_ యెప్పటూ క్యాంపులు అంటూ పోతాడు: నీకు ఏమిసుఖం, నామాట విన్నావంటే ఎంతో ఆనందంగా రోజులు గడపొచ్చు" అంటూ శాంతవైపు జరగడం మొదలెట్టాడు- శాంత కొంచం పక్కకుజరిగింది. ఆనంద్ కన్ను రెప్ప వేయకుండా చెవులు నిక్కబొడుచుకొని వింటున్నాడు_ మధ్యమధ్య వుద్రేకమువచ్చినా శాంత ఒట్టు జ్ఞాపకము_ "మీరుచెప్పింది బాగానేవుంది ఆగండి నామాట వినండీ?" అంది.

"నీమాట వినకపోతే ఎవరిమాట వింటాను. తక్షణం చేస్తాను. నాకు అంతకన్న ఏమికావాలి" అన్నాడు.

"అయితే మావారు ఒకఅమ్మాయిని ప్రేమించారు- నేను అదితప్పు, ద్రోహము, అలాచేయకండీఅని అడ్డు పడుచున్నాను అందుకనే క్యాం

పులకి అస్తమానం పోతారు- నేను ఎవరితో చెప్పుకోనూ" అంది.

"ఏదీ! చెప్పు! చెప్పు! ఆవిడ యెవరు? ఎక్కడుంది. యెలాగేనా మాట్లాడి రాజీ కుదిరిస్తాను. అపుడు మనము హాయిగా వుండొచ్చును ఏమంటావు కాంతా" అన్నాడు- ఆనంద్‌కు ఒళ్లు మండు కొస్తోంది. ఏమిటా నాటకము అనుకున్నాడు.

"అదికాదు ముకుంద్! నీకుకోపము రాదంటే చెపుతాను. ఆవిడ ఎవరోకాదు. మీ సుబ్బులే పడి చచ్చిపోతున్నారు- ఏమిచేయడానికి తోచడం లేదు-' అంది.

కూర్చున్నవాడల్లా ఒక్కగంతుతో లేచాడు- "ఆ! నా సుబ్బులా! కృతఘ్నుడు! ద్రోహి ఎవరో అనుకున్నాను, నాకే వేశాడు- ఇవాళ ఇక్కడవుంటే పీక పిసికేసియుందును- నీకు నాకు పీడ వదలిపోయేది" అన్నాడు "ఆగండి ఆగండి ఏం! ఆయన సుబ్బుల్ని అడిగితే తప్పా మీరు నన్నడగవచ్చా. నాకంతట నేను రాలేదే నేను మీకెంతో మీసుబ్బులు ఆయనకంత. మీది ద్రోహంకాదు ఆయన తలచుకుంటే నిన్ను చంపలేడూ? స్నేహితుని యింట్లో ఆయనకే ఎసరు పెట్టావు. ఒప్పుకోండి. మీరు సుబ్బుల్ని వదిలి పెట్టేటట్టు రాజీచేస్తాను. సమ్మతమేనా మి స్నేహితుణ్ణి పిలువనా? ఏమండోయ్! ఇంకా లోపలపం చేస్తున్నారు ఇద్దరు రాజీపడి బుజాలుమార్చుకోండి'' అంది. ఆనంద్ తలుపుదోసుకువచ్చాడు ఆతన్ని చూచి కంపించిపోయాడు ముకుంద్ ఆనంద్ నెమ్మదిగా వానిసీపుతట్టి ''పారం బాగా చెప్పింది. అన్నీ మర్చిపోయి మామూలుగ వస్తూ ఉండు'' అన్నాడు.




# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు 1

★

(ప్రచురణ . ప్రతి ఆదివారం)

సాలుచందా .... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

★

★ అర్ధసంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు

★ 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలుపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు "మేనేజరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబుశెట్టివీధి, జి.టి. మద్రాసు" అని వ్రాయవలెను. వ్యక్తులపేర పంపవద్దు.

—మేనేజరు